నిత్య జీవితంలో ప్లాస్టిక్ ఓ భాగమైంది. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఏదోక రూపంలో వినియోగిస్తూనే ఉంటాం. ప్రత్యామ్నాయాలెన్నో ఉన్నా ..అవగాహన లేక నిషేధిత ప్లాస్టిక్ వైపు మొగ్గు చూపుతున్నాం. ఇది కేన్సర్‌తో పాటు ఇతర అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది. మరోవైపు పర్యావరణానికి ముప్పు కలిగిస్తోంది. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. వాటిని వినియోగించడం ద్వారా పర్యావరణంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

అల్లూరులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



ప్లాస్టిక్ ముప్పు.. కలిగేనా కనువిప్పు

జలదంకి/అల్లూరు: అల్లూరు, జలదంకి మండలాల్లో వందల సంఖ్యలో చిల్లర దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, కూరగాయల దుకాణాలు ఉన్నాయి. వాటిలో విచ్చల విడిగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. 40 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న కవర్లను వినియోగించరాదనే నిబంధనలు ఉన్నా అవి ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు కూడా అడ్డూ అదుపు లేకుండా సాగుతున్నాయి. దీంతో ప్లాస్టిక్ వ్యర్థాలు రోడ్ల వెంబడి గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. చెత్తలోని ప్లాస్టిక్ ప్లేట్లు, కవర్లు తిని మూగజీవాలు సైతం మృత్యువాత పడుతున్నాయి. విచ్చల విడిగా ప్లాస్టిక్‌ను వినియోగించడం వల్ల పర్యావరణానికి ముప్పు కలుగుతుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగం పెనుభూతంలా మారి అది మానవాళి మనుగడనే కబలించే ప్రమాదం ఉంది. కోట్లాది జీవరాశుల మరణంతో పాటు ప్రాణాంతక వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయి. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ప్రమాదమని తెలిసీ ప్రజలు వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్‌ను నియంత్రించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. ప్లాస్టిక్ వినియోగాన్ని అంతం చేయడం ఏ ఒక్కరి వల్ల సాధ్యం కాదు. ప్రతిఒక్కరూ చైతన్యవంతమై ఎవరికి వారు వినియోగాన్ని తగ్గిస్తేనే ఫలితం ఉంటుంది.



అల్లూరులో డ్రైనేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు

నష్టాలెన్నో...

ప్లాస్టిక్ కవర్లను విచ్చల విడిగా వినియోగించడం వల్ల మానవాళికి ఎన్నో నష్టాలు కలుగుతున్నాయి. కవర్లు భూమిలో కలిసిపోయే తత్వం లేక ఏళ్ల తరబడి అలాగే ఉండిపోతాయి. అవి భూమిలో పేరుకుపోవడంతో వర్షపు నీరు ఇంకే పరిస్థితులు ఉండవు. భూ ఉపరితలం వేడెక్కిపోయి తీవ్ర దుష్పరిణామాలను కూడా మానవాళి ఎదుర్కోక తప్పదు. రైతాంగానికి కూడా తీవ్ర నష్టం వాటిల్లుతుంది. భూమిలోని వానపాములు నశించిపోతాయి. మరోవైపు డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోయి నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడమే కాకుండా దోమల ఉత్పత్తికి కారణమై రోగాలు కూడా సంక్రమిస్తున్నాయి.

అధికారుల చర్యలు నామమాత్రం

ప్లాస్టిక్ నిషేధంపై అధికారులు చర్యలు నామమాత్రంగా ఉండడంతో విచ్చలవిడిగా వాటి వ్యాపారం సాగుతోంది. ప్రభుత్వం ప్రకటనలు చేసిన సమయంలో అధికారులు హడావుడి చేసి ఆ తరువాత మిన్నకుండిపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, మేధావులు ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో చైతన్యం కలిగించి నిషేధం దిశగా నడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేన్సర్ ప్రమాదం

ప్లాస్టిక్ కవర్లలో విక్రయించే ఆహారాన్ని తీసుకోవడం వల్ల అందులోని రసాయన అవశేషాలు మన కడుపులోకి వెళ్లి కేన్సర్ కారకంగా తయారవుతాయి. ప్రధానంగా ఊపిరితిత్తుల కేన్సర్‌తో పాటు నరాల బలహీనత బారిన పడుతారు.ప్లాస్టిక్ తయారీలో వాడే కాడ్మియం, సీసం వంటి విషపూరితాలు మెదడుతో పాటు గుండె, ఇతర జబ్బులకు కూడా కారణమవుతున్నాయి. మరోవైపు గ్యాస్ట్రిక్ సంబంధిత సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉంది.

అనారోగ్య సమస్యలు



ప్లాస్టిక్ తయారీలో రసాయనాలను వినియోగిస్తారు. వీటి వల్ల కేన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. హోటళ్లలో వేడిగా ఉన్న ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేస్తుంటారు. దీనివల్ల కవర్లలోని అంటిమొని కరిగి ఆహారం, నీళ్లలో కలుస్తుంది. వీటి వల్ల శ్వాస, చర్మ సంబంధిత వ్యాధులు వస్తాయి. మహిళల్లో గర్భస్రావం, రుతు సమస్యలు వస్తాయి.

–డాక్టర్ కే పద్మజ, గట్టుపల్లి పీహెచ్‌సీ

నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి



ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించే దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. పర్యావరణానికి పెనుముప్పుగా ఉన్న ప్లాస్టిక్‌ను నియంత్రించాలంటే వాటిని తయారు చేసే పరిశ్రమలను మూసేయాలి. ప్లాస్టిక్ వినియోగంతో తలెత్తే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. భావితరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి.

– గాలి శ్రీనివాసులు, జేవీవీ జలదంకి మండలాధ్యక్షుడు

ప్రతిఒక్కరిలో మార్పురావాలి



ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ విషయం తెలిసీ అందరూ వాడుతుంటారు. ప్రతిఒక్కరూ చైతన్యవంతమై నిషేధిస్తేనే ఫలితం ఉంటుంది. ప్రతి పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– శ్రీధర్, ఎంఈఓ, జలదంకి

జీర్ణకోశ వ్యాధుల ముప్పు



ప్లాస్టిక్ వినియోగంతో కేన్సర్‌తో పాటు జీర్ణకోశ సంబంధిత సమస్యలు వస్తాయి. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని వీలైనంతగా తగ్గించాలి. ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి.

–డాక్టర్ వెంకటేశ్వర్లు,అల్లూరు

నియంత్రణకు చర్యలు



అల్లూరు నగర పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ వినియోగం, అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయని తమ దృష్టికి రావడం జరిగింది. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి నియంత్రణకు చర్యలు చేపడతాం. అయినా మారకపోతే జరిమానాలు విధించి చట్టపరమైన చర్యలు చేపడతాం

–ఉమామహేశ్వరరావు, కమిషనర్, అల్లూరు నగర పంచాయతీ

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండాపురం : మండలంలోని కొమ్మి, కొండాపురం సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈ ఎన్ దినేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లలో ఆర్డీఎస్ఎస్ పనులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కొమ్మి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు కొండాపురం సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

9న ఆత్మకూరుకు మంత్రుల రాక

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో ఈ నెల 9న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు ఐదుగురు రాష్ట్ర మంత్రులు రానున్నట్లు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. మంత్రి ఆనంతో పాటు మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతో పాటు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు టిడ్కో గృహ సముదాయంలో రామాలయం, 10.30 గంటలకు పంచాయతీరాజ్ అతిథి గృహం నిర్మాణాలకు శంకుస్థాపన చేయన్నట్లు చెప్పారు. 11 గంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, 11.30 గంటలకు బీసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను ప్రారంభించనున్నట్లు వివరించారు.

పొదుపు లీడర్లకు శిక్షణ

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో లోకస్ యాప్‌పై పొదుపు సంఘాల లీడర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వెలుగు అధికారులు పొదుపు సంఘాలు, సంఘ బంధాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను యాప్‌లో నమోదు చేయడంపై శిక్షణ ఇచ్చారు. సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు, కలిగిరి మండలాలకు చెందిన పొదుపు గ్రూపుల లీడర్లు పాల్గొన్నారు.

మహిమలూరు సచివాలయంలో తనిఖీలు



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ గురువారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బందితో పారిశుధ్యం, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శి విజయ్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెరువులోని కలప వేలం



కొండాపురం : మండలంలోని గొట్టిగొండాల చెరువులోని కలపకు ఇరిగేషన్ అధికారులు వేలం ప్రక్రియను గురువారం నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన వేలంలో పది మంది రైతులు రూ.10 వేలు చొప్పున ధరావత్తు చెల్లించి పాల్గొన్నారు. కలిగిరి మండలం దూబగుంట గ్రామానికి చెందిన వీరరెడ్డి మాల్యాద్రిరెడ్డి రూ.3,36,000కు కలపను వేలంలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈలు రమేష్, వెంకట్రావు మాట్లాడుతూ ఆరు నెలల్లోపు కలపను కొట్టుకోవచ్చని తెలిపారు. ఎంపీటీసీ వేమిరెడ్డి మల్లికార్జునరెడ్డి, చెరువు ఛైర్మన్ వెన్నపూస నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

యానాదుల సమస్యలను పరిష్కరించాలి



ఉదయగిరి: బండగానిపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లికి చెందిన యానాదుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర యానాదుల సంఘం అధ్యక్షుడు కేసీ పెంచలయ్య కోరారు. గురువారం ఆయన సంఘ నాయకులతో కలిసి కొత్తపల్లిలో పర్యటించారు. స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానాదుల ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చి పక్కాఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన వ్యవసాయ భూములకు హద్దులు చూపాలని కోరారు. యానాదుల సంఘ నేతలు చంద్రమౌళి,ఉష, సతీష్, నాగరాజు పాల్గొన్నారు.

సీసీకెమెరాలతో నేరాల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న ఎస్సై తిరుమలరావు

చేజర్ల: సీసీకెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై జే తిరుమలరావు తెలిపారు. ఆదూరుపల్లిలోని గ్రామసచివాలయంలో పంచాయతీ కార్యదర్శి రామయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు, దుకాణదారులకు పారిశుధ్యం, చోరీల నియంత్రణపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ దుకాణాల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా చోరీలను కట్టడి చేయవచ్చని తెలిపారు. గతంలో ఆదూరుపల్లిలో ఏర్పాటు చేసిన సీసీకెమెరాలు మరమ్మతులకు గురయ్యాయని, వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. దుకాణాల పరిసరాలను పంచాయతీ సిబ్బంది సహకారంతో పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కూడలిప్రాంతమైన ఆదూరుపల్లిలో రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపైకి ఆవులు వదలకుండా చూస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగునకు ప్రజలు సహకరించాలని కోరారు. రోడ్లపై చెత్తపడేసినా, ఇళ్లలోని మురుగును రోడ్లపైకి వదిలినా జరిమానా విధిస్తామన్నారు. ఒకటి రెండు సార్లు హెచ్చరిస్తామని, వినని పక్షంలో పోలీసుల ద్వారా కేసులు నమోదు చేయిస్తామన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్

సంగం: రోడ్డు భద్రతా నియమాలను ట్రాక్టర్ల డ్రైవర్లు విధిగా పాటించాలని సీఐ వేమారెడ్డి సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సంగంలోని కొండ కూడలి వద్ద ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ఎస్సై రాజేష్‌తో కలిసి ఆయన గురువారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని కోరారు. అతివేగంగా, మద్యం సేవించి వాహనాలను నడపరాదని సూచించారు. అనంతరం రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ట్రాక్టర్లు, ట్రక్కులకు రేడియం స్టిక్కర్లను అంటించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల విలీన ప్రక్రియను విరమించుకోవాలి



ఎంఈఓతో మాట్లాడుతున్న గిరిజన కాలనీవాసులు

ఉదయగిరి: పట్టణంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను మోడల్ స్కూల్ పేరుతో వేరే పాఠశాలలో విలీనం చేసే ప్రతిపాదనలను విరమించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు మండల విద్యావనరుల కేంద్రం ఎంఈఓ–2 తోట శ్రీనివాసులును గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. మోడల్ పాఠశాలకు తమ కాలనీకి దూరంగా ఉన్నందున విద్యార్థులు సక్రమంగా బడికి వెళ్లరని తెలిపారు. దీంతో విద్యార్థులు డ్రాపౌట్స్‌గా మారే అవకాశం ఉన్నందున వీలన ప్రతిపాదనలను విరమించుకోవాలని కోరారు. కాలనీలోని పాఠశాలలో 5వ తరగతి వరకు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

మన్నెమాలను సస్పెండ్ చేయండి



కాకాణికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కావలి : కావలి వైఎస్సార్‌సీపీ నాయకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు కోరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. మన్నెమాల వైఖరి పార్టీకి వ్యతిరేకంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి మన్నెమాలను పార్టీ నుంచి సస్పెండ్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, మద్దిబోయిన వీరరఘుయాదవ్, నీలం సాయికుమార్, బీద గిరిధర్, వాయిల తిరుపతి, వెలినేని మహేష్‌నాయుడు, సన్నబోయిన ప్రసాద్‌యాదవ్, గంధం ప్రసన్నాంజనేయులు, నెల్లూరు వెంకటేశ్వర్‌రెడ్డి, గుడ్లూరు మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



ఆత్మకూరురూరల్: పదోతరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని విశ్రాంత ఉపాధ్యాయులు కేవీ శేషారెడ్డి, వెలిశెట్టి నారాయణరావు పిలుపునిచ్చారు. మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలను గురువారం వారు సందర్శించారు. పదోతరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆత్మకూరుకు చెందిన శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి నగదు ప్రోత్సాహకాలను అందజేస్తారని తెలిపారు. విశ్రాంత పారా మెడికల్ ఆఫీసర్ అచ్చోలు నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టీల్ డస్ట్‌బిన్లు మాయం



కావలి: పట్టణంలోని ట్రంకురోడ్డుతో పాటు ఇతర ప్రాంతాల్లోని ప్రధాన రోడ్లపై మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ డస్ట్‌బిన్లు మాయమయ్యాయి. స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రధాన రోడ్లపై చెత్త పడేయకుండా స్టీల్‌రాడ్లు నాటి డస్ట్‌బిన్లు ఏర్పాటు చేశారు. అయితే డస్ట్‌బిన్లను దొంగలు ఎత్తుకెళ్లగా స్టీల్ రాడ్‌లు మాత్రం మిగిలాయి. ఈ రాడ్‌లపై అటుగా వెళ్లే పాదచారులు కూర్చుని సేదతీరుతున్నారు.

ఆలోచన పండింది



పొలం గట్లు గట్టిగా ఉంటాయి. వాటిపై సాధారణంగా ఎలాంటి మొక్కలను పెంచరు. కానీ కావలి మండలంలోని సర్వాయపాళేనికి చెందిన రైతు శ్రీను వినూత్నంగా ఆలోచించాడు. పుచ్చపంట సాగుచేసిన పొలం గట్లను ఖాళీగా వదిలేయకుండా ఒక అంచున స్వీట్‌కార్న్ నాటాడు. మొక్కలు బాగా ఏపుగా ఎదిగి కంకులు కూడా బలంగా వచ్చాయి. శ్రీను వినూత్న ఆలోచన పండడం చూసిన పలువురు రైతులు అభినందించారు.

-కావలి

సబ్సిడీ రుణాలపై విస్తృత అవగాహన



దుత్తలూరులో సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

దుత్తలూరు: ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేస్తున్న సబ్సిడీ రుణాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని బీసీ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ కే అలేఖ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలపై గురువారం ఆమె మండలాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని బీసీ ఉపకులాలకు 30, కాపులకు 4, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 9, రెడ్లకు ఒకటి చొప్పున యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించి ఈ నెల 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా చూడాలని కోరారు. ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి: ప్రభుత్వం వివిధ వర్గాల ఉపాధికి మంజూరు చేస్తున్న కార్పొరేషన్ సబ్సిడీ రుణాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అప్పాజీ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీలకు 30, కాపులకు 5, ఈడబ్ల్యూఎస్ 4, జనరిక్ మందుల దుకాణం ఏర్పాటుకు 1 చొప్పున యూనిట్లు మంజూరైనట్లు చెప్పారు. ఈ నెల 7లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పీఎం సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం



అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

ఉదయగిరి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ సిబ్బందికి సూచించారు. ఉదయగిరిలోని విద్యుత్ రెవెన్యూ వసూలు కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడికి పథకంపై అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఎస్సీ,ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచితమని, ఆపై వినియోగించిన యూనిట్లకు బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి వసూలు చేయాలన్నారు. అనంతరం మండలాల వారీగా బిల్లులు వసూలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీఈఈ ఐ శ్రీనివాసులు, ఏఈలు శ్రీహరి, ఖుద్దూస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాల మెరుగునకు పీ–4 సర్వే



సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

సీతారామపురం : పేదరికం, వృద్ధి రేటును గుర్తించి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పీ–4 పైలెట్ సర్వే చేపడుతున్నట్లు ఏపీఎస్ డీపీఎస్ యంగ్ ప్రొఫెషనల్ వెంకటేష్ అన్నారు. సీతారామపురం పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న పీ–4 సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ప్రజల నుంచి సర్వేకు సంబంధించిన 21 ప్రశ్నలకు సమాధానాలను రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాలను పీ–4 పైలెట్ సర్వే కోసం ఎంపిక చేసిందని తెలిపారు. అందులో సీతారామపురం కూడా ఒకటన్నారు. ఈనెల 9 వ తేదీలోగా సర్వేను పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. ఎన్యూమరేటర్లు సర్వేను పారదర్శకంగా నిర్వహించి సమగ్ర వివరాలను సేకరించి వాటిని గూగుల్ ఫామ్‌లో పొందుపర్చాలని సూచించారు. ఆత్మకూరు డీవైఎస్ఓ సురేష్, ఈఓపీఆర్డీ భార్గవి, ఏఎస్ఓ కుమార్, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో బాలికల ప్రతిభ



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 3,4 తేదీల్లో మైదుకూరులో జరిగిన రాష్ట్రస్థాయి బాలికల జంప్‌రోప్ పోటీల్లో ఎస్కే హసీనా, పీ శ్రీలేఖ, ఎస్కే సోఫియా, డీ ధన్యదీపిక, సీహెచ్ ఆషా, డీ భావన, ఎస్ దివ్యదక్షిణి ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాలు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయిని రజనీ విలాసినిని హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.